# చూడాలనివుంది




"జాతస్యహి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్యత

తస్మాద పరిహార్యేర్థే నత్వం
శోచితు మర్హసి —

అవి ఆర్యులు చెప్పేరు. పుట్టిన వాళ్ళకు చావు తప్పదు. పోయిన వాళ్ళకి పుట్టుకా తప్పదు. నశించేది కాబట్టే దీన్ని శరీరం అన్నారు. శాశ్వతమైన ఆత్మలు సరదాగా ఈ శరీరంలో ప్రవేశించి సమస్య లేవో కల్పించుకొని మూన్నాళ్ళ ముచ్చటగా ఆడుకుని ఈ భూమ్మీద పుట్టిన శరీరాన్ని భూమ్మీదే వదలి పెట్టి పోతాయ్. ఈ మూన్నాళ్ళకే ఏవో వెర్రి భ్రమల్లో పడి, నేనూ... నా వాళ్లూ అని మిడిసి పడతాం. ఆ మిడిసిపాటు ఎన్నాళ్లో మనకి తెలుసు...."

నిశ్శబ్దంగా వింటున్న ఇరుగు పొరుగు వాళ్ళు ఓ క్షణంవరకూ రెప్పపాటు మర్చిపోయేరు.

"ఇన్ని తెలిసీ ఈ శరీరంమీద మమకారం పెంచుకోకుండా ఉండలేం. కోర్కెల్ని అరికట్టు కోలేం. ఆశల్ని త్రుంచుకోలేం. ఏవిటో ఇంత చెప్తానా....ఒక్క నాడు తమలపాకులు వేసుకోకపోతే ఈ ప్రాణం గిజగిజ లాడిపోతుంది. అదేమాయ. అదో తెరలా కళ్ళను కప్పుతుంది. తొలగించుకుంటే ధన్యులమౌతాం. అప్పుడే ఆత్మని చూడగలుగుతాం. అది సాధ్యమో కాదో ఈ జన్మకి...."

అప్పటికే నాలుగ్గంటలు కొట్టడంతో నిట్టూరుస్తూ లేచింది జానకమ్మ.

"ఇంత తెలిసీ మీరే అలా అంటే ఏవీ తెలియని మేము మరీ చీకటిలో ఉండిపోతున్నాం అన్న మాట" అని ఒకావిడంది.

అంతా వెళ్ళిపోయేరు.

జానకమ్మ తలుపు చేర వేసి కాఫీ కాచేందుకు ఉపక్రమించింది. కుంపటి అంటిస్తూంటే అప్రయత్నంగా శారదమీదికి పోయింది మనసు.

శారదంటే ప్రాణం తనకి.

గాలి మార్పుకని తీసుకువెళ్లాడు అల్లుడు. నాలుగూళ్ళూ తిప్పుతూ వస్తానన్నాడు.

ప్స్....పిచ్చి పిల్ల .... ఎక్కడుందో?....ఎలాగుందో?....

కుంపటిమీద నీళ్ళతో తపేళా పడేసింది.

శారదను కొన్నాళ్ళు తన దగ్గరే ఉంచుకొని తనకు తోచిన నాలుగు వేదాంతం ముక్కలు చెప్పి పిల్ల విచారం పోగొట్టాలని తాపత్రయ పడింది. కాని డాక్టరు గాలి మార్పుకి

ఎక్కడికైనా తీసుకువెళ్తే మంచిదని సలహా ఇచ్చింది. లేకుంటే అంత కష్టంలో ఉన్న పిల్లను వెళ్ళనిస్తుందా?

గడియారం ఓ గంటకొట్టి హెచ్చరించింది.

ఆయన వచ్చే వేళయింది వచ్చేసరికి కాఫీ ఉండాలి.

జోరుగాలి విసిరింది. నిప్పు ఎర్రగా మండుతూంటే మనసు మెల్లిగా గతంలోకి జారిపోయింది.

జానకమ్మకు శారద ఒకర్తే సంతానం. అంచేతనే శారద ఆమెకు సర్వస్వమూ అయ్యింది.

అత్తవారింటికి వెళ్ళినా నెలకూ, రెండు నెల్లకూ శారదైనా ఇటు వస్తూండేది, తనైనా అటు వెళ్తూండేది.

కూతురు కడుపున ఓ కాయ కాయబోతోందని తెలిసినపుడు ఏ తల్లి మమతకైనా హద్దులుండవు. ఆ అనుభవం జానకమ్మకూ కలిగింది. తొలి కాన్పుకి మూణ్ణెల్లు ముందుగా శారదను తెచ్చిందింటికి.

జానకమ్మ చేతిలో మళ్ళీ నెలల బిడ్డైపోయింది శారద.

కాన్పు కష్టం కావచ్చునని డాక్టరమ్మ చెప్పటంతో తన ముచ్చట

## విషాద కథ

కొంచెం దెబ్బతిన్నా, పిల్ల సుఖం గురించి హాస్పిటల్లో చేర్పించింది జానకమ్మ.

అన్నట్టు కాన్పు కష్టమే అయ్యింది. సిజేరియన్ చేసి బిడ్డను తీసేరు. ప్రీమెచ్యూర్ బేబీ ఏమో, ఉండవలసిన కనీసపు బరువులేదుట. అయితే ఏం? నిజంగా చందమామే పుట్టింది. ఈ చందమామను చూస్తే ఇరవై ఏళ్ళ క్రితం పుట్టిన జాబిల్లి జ్ఞాపకానికి వచ్చింది. ఆ జాబిల్లి మరో జాబిల్లికి జన్మనిచ్చింది. సృష్టి కంతేముంది?

శారద ఈ క్రొత్త అనుభవంలో పడి తనుపడ్డ బాధేమరచిపోయింది. అంత నీరసంలోనూ మాటిమాటికీ పాప వంక చూస్తూ మురిసిపోతూండేది.

ప్రీమెచ్యూర్ బేబీ అయినందువల్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకు

న్నారు. పాప పళ్ళంతా దూదిపెట్టి చుట్టి ఏవేవో ఇంజక్షన్లు ఇచ్చి ఎంతో శ్రమపడ్డారు.

ఆఖరికి శ్రమే మిగిలింది. బేబీ సీరియస్ అయ్యింది ఆ రాత్రి.

సిస్టర్ వెళ్ళి డ్యూటీ డాక్టరును పిలుచుకు వచ్చేలోపునే పాప చిన్ని ప్రాణం చల్లారిపోయింది. కర్మణ్యే వాధి కారస్తే మాఫలేషు కదా చన.... కర్మ చెయ్యటం వరకే మన కధికారం వుంది. దాని ఫలిత మ్మీద లేదుకదా?

ఏడ్చేందుక్కూడా హాస్పిటల్లో స్వేచ్ఛ ఉండదు. అందుకనే నేమో శారద పాపకేసి చూస్తూ బొమ్మలా ఉండిపోయింది. ఏ భావ మూ వ్యక్తంకాని కూతురు ముఖంకేసీ చూస్తూ జానకమ్మ కూడా అలానే అయిపోయింది. కాని పాప నుండి దృష్టి మరల్చుకుని శారద తల్లి కేసి చూసినప్పుడు మాత్రం జానకమ్మ కడుపులో దేవినట్ట య్యింది.

కూతురి తల నిమురుతూ ఓదార్పుగా నాలుగు మాటలు చెప్పింది. అంతా ఋణానుబంధం అనీ,పాపకేనాడో ఈ నాలుగ్గంటలూ ఋణపడి ఉన్నామనీ, అంది. చెట్టు తొడిగే ప్రతి మొగ్గా పువ్వు కాలేదనీ. పూసే ప్రతిపువ్వూ కాయకాలేదనీ. కాసే ప్రతికాయా పండదనీ.... మొగ్గగా రాలిపోయేవీ, పువ్వుగా వాడిపోయేవీ, కాయగా ఎండి పోయేవీ అనేకం ఉంటాయనీ.... అది ప్రకృతి నైజమనీ, ఎన్నో ఎన్నెన్నో చెప్పింది.

ఏనాడూ కష్టంలో ఏడ్చి సుఖంలో నవ్వని జానకమ్మకు కూడా ఆ మర్నాడు తెల్లవారు ఝూమున శారద పడుకున్న మంచం మీది తలగడ పూర్తిగా తడిసిపోవటం చూసి గుండె చెరువై పోయింది.

రోజులు గడుస్తున్నా శారద మాత్రం ఈ దెబ్బనుండి కోలుకో లేకపోయింది. అన్నిటికీ మందు కాలమే అనుకున్నా ఏన్నాళ్ళయినా శారద విషయంలో అదీ పనికి రాలేదు. నాలుగూళ్ళూ గాలిమార్పుకి తిప్పితే ఏమైనా గుణం కన్పించ వచ్చునేమోనని డాక్టర్లు సలహా ఇచ్చారు.

అల్లుడు తీసుకువెళ్ళాడు.

కుంపటి మీద నీళ్ళు మరిగి మూత ఎగిరెగిరి పడుతోంది. తపేలాకి ఆ మూత కలిపి కుట్టే

సినా దాంతోనైనా సరే గాలిలో కెగిరి గాలిలో కలిసి పోతానంటూ వుంది అందులోని నీటియావిరి.

గమ్మున తపేళా దించి కాఫీ డబ్బా అందుకుంది.

ఆ సాయంత్రం మరి ఉండ బట్టలేక రాఘవయ్యగారితో అంది, "అమ్మాయి ఎక్కడ వుందో.... చూడాలని వుందండీ...." అని.

అమ్మాయికి మళ్ళా తిరగ బెడితే హాస్పిటల్లో జేర్పించానని ఏ వూరినుండో వ్రాసిన అల్లుడి ఉత్తరం జేబులోనే వుందాయనకు. చెప్పాలని నోరు తెరిచి, "ఎక్కడ ఉన్నారో ఏమో.... ఉత్తరం వ్రాస్తే చూద్దాంలే...." అన్నారు భోజనానికి లేస్తూ.

భోజనం ముగించి వీధి అరుగు మీది ఈజీ ఛైర్‌లో పేపరు తిరగే స్తూంటే.... లోపలెక్కడో జాన కమ్మ గిన్నెలు సర్దుతోంది.

"టెలిగ్రాం సార్!" అంటూ వచ్చాడు మెసెంజరు.

'శారద ఎక్స్‌పైర్డ్' అన్నవార్త రాఘవయ్యగారి గుండెకు శరా ఘాతంలా తగిలింది.

ఒక్కగా నొక్క కూతురు అన్యాయంచేసి పోయింది. ఆ బాధ తక్కువదేం కాదు. కాని ఈ వార్త వింటే భార్య ఏమై పోతుందో నన్న బెంగ మరింత క్రుంగ దీసిం దాయన్ను. 'ఉత్తరం వచ్చినప్పుడే శారదకు బాగోలేదని చెప్పివుంటే ఈ వార్తకు ఆమె గుండె ప్రిపేర్ అయివుండేదేమో.....ఎంత పని జరిగిందిరా భగవంతుడా!.....' అను కుంటూ కుర్చీలోనే కూలబడి పోయారు.

ఈ వార్త తను చెప్పలేదు, చెప్పకుండా ఉండలేడు. ఆయనకు తెలుసు — జానకమ్మ సర్వస్వం శారద. తన మీదకన్నా కూతురిపై అపరిమితమైన ప్రేమ వుంది ఆమెకు. ఒక తల్లి ఒక బిడ్డమీద చూపించే ప్రేమకన్నా అతీతమైన దది. కూతురి పెంపకంలోపడి జానకమ్మ ఒక్కోసారి భర్తనే మర్చిపోయేది.

"మీ ఇద్దరి ప్రాణాలూ ఒకటేనే లోకంలో మరి తల్లీకూతుళ్ళే లేనట్టు కట్టుకున్న మొగుణ్ణి మర్చి పోతే ఎలా...?" అనేవాడు తను.

అవన్నీ జ్ఞాపకం వచ్చి కళ్ళు చెమరుస్తూ వున్నాయి. ఇంతలో "ఏమిటండీ?" అంటూ వచ్చింది జానకమ్మ. "ఏమీలేదు....ఎవరో

వ స్తేనూ....." అంటూ కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయారు.

మంచంమీద నడుం వాల్చేరు. జానకమ్మ తమలపాకులు చిలకలు చుట్టి ఇస్తుంటే ఎలా చెప్పటమా అని చెప్పటానికి తన మనసును సిద్ధం చేసుకుంటున్నారు రాఘవయ్యగారు. అతి ప్రయత్నం మీద గుండె చిక్కబట్టుకుని చెప్పబోయేంతలో జానకమ్మే మొదలు పెట్టింది-

"అన్నట్టు.....ఇది విన్నారూ? సరస్వతమ్మ కొడుకు పోయాట్ట. మీరు ఆఫీసుకు వెళ్ళాక తెలిసింది. పలామర్శకి వెళ్ళాను. ఆ తల్లి ఒకటే ఏడుపు.అది చూస్తే మనిషికీ మనిషికీ మధ్య అనుబంధాలు దుఃఖానికి దారి తీస్తాయని అనిపించింది. పోయే ప్రాణాల్ని ఎవ్వరూ ఆపలేం. ఆ యిద్దరిలో ఒకరు చచ్చిపోతే రెండో మనిషి అలా దుఃఖించ వలసిందేనా?.... అది ఎవ్వరికైనా తప్పదా?.... ఎందుకీ రంపపుకోత సృష్టించేడీ భగవంతుడు?...ఏవిటో ఎవరికి ఏది ప్రాప్తముందో...."

జానకమ్మ లైటు ఆర్పి మరో మంచం వాల్చుకుని నడుం చేరేసింది. ఆమె చెప్పిన మాటలు వింటూంటే ఎప్పటికైనా ఆ దుఃఖం తనకీ తప్పదని ఆమె తెలుసుకున్నట్టుంది. అందుచేత ఇప్పుడు చెప్పినా ఆమె తట్టుకోగలదేమోనని పించిందాయనకు.

"చూడు జానకీ:....." తన ముఖాన్ని కనబడనీయకుండా మొదలెట్టాడు.

"ఊఁ" అంది జానకమ్మ.

"ఈ అనుభవాలు వద్దనుకున్నా తప్పవు. నువ్వింత చెప్తావు-స్వానుభవానికి వచ్చేసరికి నువ్వూ అంతేనేమో...."

"పుట్టిన ప్రతివ్యక్తీ ఎప్పుడో ఒకప్పుడు ఈ ప్రాణాలు విడుస్తాడు. కాకపోతే కాస్త ముందూ వెనకా. ఇది అందరికీ తెలిసిందే అయినా, ఆ బంధాల్ని వెంటనే త్రెంచుకోలేక దుఃఖం కట్టలు త్రెంచుకున్నట్టు ఏడుస్తారు, ఏడుస్తారు. కొన్నాళ్ళకి మర్చిపోతారు. తండ్రైనా, తల్లయినా కొడుకైనా, కూతురైనా లోకపు రీతి ఇది. కాని ఎవ్వరూ పోయేవాళ్ళతో పోలేరు. అయితే ఏ కొద్దిమందో పోయిన వాళ్ళని మరిచిపోలేనివాళ్ళుంటారు. అలాంటివాళ్ళు బ్రతకటం నిరర్థకమే."

"రాధద ఒకవేళ పోయిందనుకో...."

"ఛీ....ఏం అమంగళపు మాటలండీ...."

"లేదు జానకీ!....జరిగిందంతే. టెలిగ్రాం...." అంతవరకూ అతి కష్టం మీద అణగద్రొక్కుకున్న దుఃఖం పొంగి పొరలి ప్రవహించింది ఆయనలో.

"రేపుదయాన్నే ప్రయాణమవుదాం...." అన్నారు తిరిగి. జానకమ్మ మాట్లాడలేదు. ఆమెను కదిపే ధైర్యం లేకపోయిందాయనకు. ఏవో చెప్పి, ఆమెచేత ఏవేవో చెప్పించి, తనివితీరా భారం తీరేలా ఏడవటానిక్కూడా నోచుకోకుండా నోటికి తాళం వేయించేసాడాయనే.

కళ్ళు మూసుకున్నా నిద్ర రాలేదు. ఆ రాత్రంతా శారద బాల్యంనుండీ తమను మురిపించిన తీరు సినిమాలా కన్పిస్తోందాయనకు.

అప్పుడప్పుడు దుఃఖం తెరలుగా వస్తోంది. ఆలోచనలు మరల్చుకోవడానికి అటూ ఇటూ ఒత్తిగిలేవారు. కిటికీలోనుండి పడే సన్నని వెల్తురులో జానకమ్మ అస్పష్టంగా కన్పిస్తుండేది. సగం రాత్రివరకూ ఆమె అసహనంగా కదుల్తూండటం, ఆ పైన హాయిగా నిద్రపోవటం చూసిన ఆయన ఎంతో ఆశ్చర్యపోయేరు. తను మగవాడయ్యుండీ దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోయ్యారు. ఆమె నిండుకుండ అన్న సంగతి ఆయనకి తెలిసినా ఇంతటి నిగ్రహం సంపాదించుకున్న ఆమెను చూసి తమ ఇరవయ్యేళ్ళ కాపురంలో ఆమె నర్థంచేసుకున్నానన్నది పొరబాటనిపించిందా క్షణంలో.

ఆలోచన్ల మగతలోనుండి గతంలోకి వెళ్ళిపోయి ఎప్పుడో వర్తమానంలోకి వచ్చిన ఆయన, తూర్పు కిటికీలోనుండి సూర్యకిరణాలు చూసి తుళ్ళిపడి లేచారు. తమ ప్రయాణం జ్ఞాపకం వచ్చి, లేచి కూర్చుని ఎదురుగుండా మంచంమీద ఇంకా నిద్రపోతున్న జానకమ్మను చూసి మరోసారి తుళ్ళిపడ్డాడాయన.

మెల్లగా లేచి వెళ్ళి ఆమె భుజంమీద తడుతూ. "జానకీ!" అన్నారు నెమ్మదిగా. ఆ వెంటనే దుఃఖంతో బొంగురు పోయిన కంఠంతో. "శారదను చూడాలని వుందంటూ నన్ను వదిలేసి నువ్వొక్కర్తెవే ప్రయాణమైవెళ్ళిపోయేవా జానకీ...." అంటూ గొణుక్కున్నారు.